నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
బుధవారం | 05 జూన్ 2024 | www.navatelangana.com

పిడుగుపాటుతో యువకుడు, మూడు మేకల మృతి



నవతెలంగాణ-పెద్దశంకరంపేట్

మెదక్ జిల్లా పెద్దశంకరపేట మండల పరిధిలోని బూరుగుపల్లి చందా నాయక్ తండాకు చెందిన మూడవత్ జైపాల్ (25) మంగళవారం మేకలు కాయడానికి వెళ్లాడు. ఒక్కసారిగా పిడుగు పడటంతో యువకుడు జైపాల్‌తో పాటు మూడు మేకలు మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. చందా నాయక్ తాండకు చెందిన జైపాల్ ప్రతిరోజు మేకలను కాస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా మృతుడు ముదావత్ జయపాల్ భార్య ప్రస్తుతం గర్భం దాల్చి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. జైపాల్ పిడుగుపాటుతో చనిపోవడంతో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని గ్రామస్తులు, స్థానికులు కుటుంబ సభ్యులు కోరారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కామెర్ల భారిన మరో ఇద్దరు

- చికిత్సకు కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో గ్రామస్తులు కామెర్ల వ్యాధి భారిన పడుతూనే ఉన్నారు. మంగళవారం గ్రామానికి చెందిన మామిడాల రాజు గౌతమి దంపతులు అనారోగ్యానికి గురవ్వగా చికిత్స కోసం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి వేళ్లారు. వైద్యుడు వెంటనే బాధితులను కరీంనగర్ ఆస్పత్రికి వేళ్లాలని సూచించారు. కరీంనగర్ ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు నిర్వహించుకోవడంతో ఇరువురికి కామెర్ల వ్యాదిగా వైద్యలు నిర్ధారించారని బాధితులు తెలిపారు. గ్రామంలో కామెర్ల వ్యాదితో నూతన కేసులేమి నమోదవలేదని వైద్యాధికారులు తెలిపిన 24 గంటల్లోనే దంపతులిద్దరూ కామెర్ల వ్యాధి భారిన పడడం గమనార్హం. గ్రామస్తులు కామెర్ల వ్యాది భారిన పడుతుండడంతో అందోళన వ్యక్తం చేస్తున్నారు. బేగంపేట గ్రామంలో జిల్లా వైద్యాధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి కామెర్ల వ్యాదికి గల కారణాలపై విచారణ చేపట్టాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

జహీరాబాద్‌లో కాంగ్రెస్...మెదక్‌లో బీజేపీ గెలుపు

- బీజేపీకి కలిసొచ్చిన బీఆర్ఎస్ ఓట్లు
- పటాన్‌చెరు, సిద్దిపేట, సంగారెడ్డిలో కమలానికి భారీ ఓటింగ్
- ఎమ్మెల్యేలున్నా సంగారెడ్డి, పటాన్‌చెరు, సిద్దిపేటలో బీఆర్ఎస్‌కు ఓట్లు రాలె
- కాంగ్రెస్ కొంప ముంచిన సిద్దిపేట, దుబ్బాక, మెదక్
- జహీరాబాద్‌లో సత్తా చాటిన కాంగ్రెస్
- ఇక్కడ కూడా బీజేపీకి గులాబీ క్రాస్ ఓటింగ్



నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
సిద్దిపేట	33174	62823	65501
మెదక్	55588	67374	40776
నర్సాపూర్	72376	51811	54372
సంగారెడ్డి	75287	70310	27874
పటాన్‌చెరు	94294	103775	54581
దుబ్బాక	31641	50873	66714
గజ్వేల్	65539	56811	85432
మొత్తం	452078	471217	395250

విజేత బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మెజార్టీ 39139

నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
జహీరాబాద్	523919	476023	171412

విజేత కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షేట్కర్ మెజార్టీ 47896





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి మాదవనేని రఘునందన్‌రావు గెలుపొందగా జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షేట్కర్ విజయం సాధించారు. బీఆర్ఎస్ మాత్రం రెండు చోట్ల మూడో స్థానానికే పరిమితమైంది. మెదక్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో ఆరుగురు ఎమ్మెల్యేలు గెల్చి 2 లక్షల ఓట్ల మెజార్టీ తెచ్చుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం బీఆర్ఎస్ చావుదెబ్బతిన్నది. వచ్చిన ఫలితాలతో పార్టీ అంచనాలు తలకిందులయ్యాయి. ఆరుగురు ఎమ్మెల్యేలున్నా ఆ పార్టీ కనీస ఓట్లు సాధించలేకపోయింది. బీఆర్ఎస్ చతికిల పడడంతో బీజేపీకి కలిసొచ్చింది. ఓటర్లలో విశ్వాసం కల్పించడంతో ఎమ్మెల్యేలు విఫలమైనందున్నే వాళ్లంతా బీజేపీ వైపు మళ్లినట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ నైరాస్యం బీజేపీకి లాభం చేకూర్చింది. సిద్దిపేటలో కేవలం 2618 ఓట్ల మెజార్టీ మాత్రమే బీఆర్ఎస్‌కు వచ్చింది. కాంగ్రెస్ సైతం రెండు స్థానాల్లో గెలవాలని ప్రయత్నించినా జహీరాబాద్‌కే గెలుపు పరిమితమైంది. మెదక్‌లో ఆ పార్టీకి కూడా పలు నియోజకవర్గాల్లో ఆశించిన ఓట్లు పడలేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఉన్న మెదక్‌లో సైతం బీజేపీకి మెజార్టీ వచ్చింది. నీలం మధు సొంత నియోజకవర్గం పటాన్‌చెరులో కూడా కాంగ్రెస్ కంటే బీజేపీకే లీడ్ వచ్చింది. సిద్దిపేటలో అసలే ఫర్ఫార్‌మెన్స్ చేయలేకపోయింది. మైనంపల్లి కుటుంబం ఎఫెక్ట్ పెద్దగా కనిపించలేదనే చర్చ ఉంది. శత్రువుల బలహీనతల్ని సరిగ్గా వాడుకోవడం వల్లనే బీజేపీ మెదక్‌లో గెల్వగల్గిందని చెప్పక తప్పదు. జహీరాబాద్‌లో సైతం కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య పోటీ కాకుండా బీజేపీ తెరమీదికి వచ్చింది. బీఆర్ఎస్ ఓట్లు క్రాస్ కావడం వల్లనే బీజేపీకి భారీగా ఓట్లు పడ్డాయి.

హరీశ్‌రావు అడ్డాలో తగ్గిన మెజార్టీ

మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలవడిన తర్వాత అనేక కోణాల్లో విశ్లేషణలు వస్తున్నాయి. ముఖ్యంగా మెదక్‌లో బీఆర్ఎస్ గెలుస్తుందనే అంచనాలో గులాబీ నేతలున్నారు. వివిధ సర్వే సంస్థలు కూడా బీఆర్ఎస్ గెలిస్తే అది మెదకే అవుతుందని తేల్చారు. అందరి అంచనాలకు అందనిలా మెదక్‌లో బీజేపీ పాగా వేసింది. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వచ్చిన ఓట్ల సరళిని పరిశీలిస్తే... బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డికి సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్‌లో భారీ మెజార్టీ వస్తుందని, మిగతా చోట్ల సరాసరి ఓట్లు వచ్చినా గెలుపు తమదే అని చెప్పారు. తీరా ఈవీఎంలు విప్పాక అవసలు విషయాలు వెలుగు చూశారు. సిద్దిపేట నియోజకవర్గంలో హరీశ్‌రావు కీలక నాయకుడుగా ఉండి ఎన్నికల ప్రచారం చేశారు. అయినా అక్కడ బీఆర్ఎస్‌కు 65501 ఓట్లు మాత్రమే వచ్చాయి. అదే బీజేపీ మాత్రం 62823 ఓట్లు సాధించి బీఆర్ఎస్ ఆధిక్యానికి గండి కొట్టింది.అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్‌రావుకు వచ్చిన మెజార్టీ అన్ని ఓట్లు కూడా ఎంపీ అభ్యర్థికి రాలేదు. సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఉన్నప్పటికీ కేవలం 27874 ఓట్లు మాత్రమే వెంకట్రాంరెడ్డికి పడ్డాయి. ఈ నియోజకవర్గంలో బీజేపీకి భారీ ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి 24 వేల ఓట్లు వస్తే ఎంపీకి 70310 ఓట్లు వచ్చాయి. పటాన్‌చెరులోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి చేతులెత్తేశారు. అభ్యర్థి వెంకట్రాంరెడ్డి నివాసం కూడా అక్కడే ఉంది. అయినా 54581 ఓట్లకే పరిమితమైంది. బీజేపీ మాత్రం భారీగా లక్షా 3775 ఓట్లు సాధించింది. ఉత్తర భారతీయులధికంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులిద్దరూ పటాన్‌చెరు ప్రాంతం వాళ్లైనా బీజేపీకే మెజార్టీ వచ్చింది.

సిద్దిపేట, దుబ్బాకలో కాంగ్రెస్ నైరాశ్యం

మెదక్ ఎంపీగా పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు సిద్దిపేట, మెదక్ నియోజకవర్గాల్లో నిరాశ్యం ఎదురైంది. ఆరు గ్యారంటీల ప్రభావం కనిపించలేదు. సిద్దిపేటలో కేవలం 33174 ఓట్లే వచ్చాయి. బీజేపీకి వచ్చిన ఓట్లల్లో సగం కూడా కాంగ్రెస్‌కు రాలేదు. మెదక్‌లో ఎమ్మెల్యే రోహిత్‌రావు ఉన్నప్పటికీ ఆశించిన ఓట్లు పడలేదు. 55588 ఓట్లే వచ్చాయి. అక్కడ బీజేపీకి కాంగ్రెస్ కంటే 11786 ఓట్లు అధనంగా పోలయ్యాయి. దుబ్బాకలో సైతం 31641 ఓట్లకు కాంగ్రెస్ పరిమితమైంది. నర్సాపూర్‌లో 72376 ఓట్లు, సంగారెడ్డిలో 75287 ఓట్లు సాధించి బీజేపీ, బీఆర్ఎస్‌లపై ఆధిక్యం ప్రదర్శించింది. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మెదక్ నియోజకవర్గాల్లో మైనంపల్లి హనుమంతారావు, రోహిత్‌రావులిద్దరూ భారీ మెజార్టీ తీసుకొస్తున్నట్లు పలుమార్లు చెప్పారు. తీరా ఆ ప్రాంతమంతా కాంగ్రెస్ కాంగ్రెస్‌కు బలహీనమైన ఓట్లు వచ్చి బీజేపీకి మాత్రంర భారీగా ఓట్లు పడ్డాయి. సరైన కేంద్రీకరణ పెట్టలేదనే చర్చ ఉంది. అభ్యర్థి నీలం మధును కూడా పటాన్‌చెరు, సంగారెడ్డి, నర్సాపూర్‌కే పరిమితం చే శారంటున్నారు.

రఘునందన్‌కు కలిసొచ్చిన బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓటింగ్

సిద్దిపేట, పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు భారీ ఓట్లు వస్తాయనుకున్నారు. తీరా ఆ పార్టీకి మూడు చోట్ల కూడా నామమాత్రం ఓట్లే వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లలన్నీ కూడా బీజేపీకి క్రాస్ అయ్యాయనే చర్చ ఉంది. అదే విధంగా కాంగ్రెస్ కూడా మెదక్, దుబ్బాక, సిద్దిపేటలోనూ కాంగ్రెస్‌కు బలమైన ఓట్లు పడాలి. కానీ..! అక్కడ కూడా సాధారణ పర్ఫార్‌మెన్స్ మాత్రమే చూపింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓటు బ్యాంకు బీజేపీకి మల్లడంతో రఘునందన్‌రావు గెలుపు చాలా సులువైందంటున్నారు. ఎందుకంటే మొదటి ఐదారు రౌండ్లలో కూడా బీఆర్ఎస్ లీడ్‌లో ఉంది. బీఆర్ఎస్‌కు తక్కువ ఓట్లు వచ్చిన ప్రాంతాల ఓట్లు లెక్కింపు మొదలవ్వగానే అక్కడ కమలం వికసించుడు షురూ అయ్యింది.

జహీరాబాద్‌లో కాంగ్రెస్ జైత్రయాత్ర

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి జైత్రయాత్ర సాగించారు. 2009 పరిస్థితిని పునరావృతం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షేట్కర్ సమీప బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ 47,896 ఓట్ల మెజార్టీతో గెలిచారు. మాజీ ఎంపీగా ఎమ్మెల్యేగా నియోజకవర్గమంతా సుపరిచితుడైన షేట్కర్ భారీ మెజార్టీలో విజయం సాధించారు. ఎమ్మెల్యే టికెట్, బీఫామ్ చేతికిచ్చి తిరిగి తీసుకున్నా త్యాగం చేసి పార్టీలో అవకాశం కోసం ఎదురు చూశారు. ఎంపీ టికెట్ రావడంతో ప్రజల ఆధరణతో గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నలుగురు కూడా ఎంపీ గెలుపు కోసం కృషి చేశారు. బీజేపీకి అక్కడ కూడా బీఆర్ఎస్ చతికిల పడడం వల్ల కమలానికి కలిసొచ్చింది. ఆ పార్టీ గెల్వలేకపోయినా 4,76,023 ఓట్లను పొందగల్గింది. స్థానికేతరుడైన గాలి అనిల్‌కుమార్ నియోజకవర్గమంతటా ప్రభావం చూపలేకపోయారు. దీంతో బీఆర్ఎస్ నుంచి రెండు సార్లు ఎంపీగా పనిచేసి బీజేపీ నుంచి పోటీ చేసిన బీబీపాటిల్ వైపు గులాబీ ఓటర్లు మళ్లారు. దీంతో గాలి అనిల్ కుమార్‌కు కేవలం 171412 ఓట్లు మాత్రమే వచ్చాయి. అయినా కాంగ్రెస్ తమ సత్తాను చాటడంతో విజయం హస్తగతమైంది.

వెంకటేశ్వర్లు యూనివర్సిటీకి చేసిన కృషిని మరువలేం



లినవతెలంగాణ-ములుగు

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఐసిఏఆర్ మాజీ జెయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ములుగు యూనివర్సిటీ కి చేసిన సేవలు వెలకట్టలేవని వైస్ ఛాన్స్ లర్ నీరాజ ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రమైన ములుగులో మాజీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలంగాణ రాష్ట్ర ఉద్యాన ములుగు యూనివర్సిటీకి రిటైర్మెంట్ తర్వాత మొదటిసారి వచ్చారు. ఆయనకు అధికారులు విద్యార్థులతో కలిసి ఘనస్వాగతం పలికి సన్మానం చేశారు. యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ నీరజ ప్రభాకర్ మాట్లాడుతూ బోర్డు ఆఫ్ మేనేజ్మెంట్ సమావేశంలో ఆయన యూనివర్సిటీకి చేసిన సేవలు, కృషి వెలకట్టలేనివన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు భగవాన్, గర్వాణి, నటరాజ్‌తో పాటు పాల్గొన్నారు.

నేడు కోమటి చెరువుపై ఎస్పి బాలుకు స్వరనీరాజనం

నవ తెలంగాణ-సిద్దిపేట + గానగంధర్వులు ఎస్పీ బాలసుబ్రమణ్యం 78 జయంతి సందర్భంగా కోమిటీ చెరువుపై బుధవారం స్వరనీరాజనం నిర్వహిస్తున్నట్లు ఈవెంట్స్ మేనేజర్స్ అసోసియేషన్ నిర్వాహకులు పవన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట ఈవెంట్స్ మేనేజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోమటి చెరువు పైన యోగ కేంద్రంలో సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు సిద్దిపేట గాయనీ, గాయకులచే ఎస్పీ బాలుకి స్వరనీరాజనం నిర్వహించబడునని తెలిపారు. సంగీత ప్రియులు, ఎస్పీ బాలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

షెట్కార్ విజయం పట్ల హర్షం

నవతెలంగాణ-మనూర్

జహీరాబాద్ ఎంపీగా సురేష్ షెట్కర్ విజయం సాధించడం పట్ల మనూర్ మండల కాంగెగ్రెస్ పార్టీ నాయకుడు,పీఎస్ఆర్ యువసేన అధ్యక్షుడు పోతుల మహిపాల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సురేష్ షెట్కార్ విజయం కోసం పని చేసిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకి, ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికి ఆయన దన్యవాదాలు తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి గెలుపొందిన సురేష్ షెట్కార్‌కు మహిపాల్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి



నవతెలంగాణ-పెద్దశంకరంపేట : మండలంలోని రాఘవానితండాకు చెందిన నెనవాత్ నెహ్రూ (35) అనే వ్యక్తి మంగళవారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నెహ్రూ వ్యవసాయంతో పాటు తన బావమరిదికి చెందిన రెస్టారెంట్ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం జాతీయ రహదారి పక్కన ఉన్న రెస్టారెంట్ వద్ద పేరు బోర్డుకు విద్యుత్ వెలుగులు రాకపోవడంతో తీగలు సరి చేయడానికి రేకులపైకి ఎక్కి మరమ్మ తులు చేయబోయాడు. ఇంతలో విద్యుత్ షాక్‌కు గురై నెహ్రూ అక్కడిక క్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎస్సై శంకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కాంగ్రెస్ నాయకులు సంబరాలు



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీగా సురేష్ షెట్కర్ గెలుపొందడంతో మంగళవారం పెద్ద శంకరంపేటలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో పెద్ద శంకరంపేటలో భాజా భజంత్రీలతో ర్యాలీ నిర్వహించి బాణాసంచాలు కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయిని మధుసూదన్, ఆర్ఎస్ సంతోష్ కుమార్, జనార్ధన్, రాజేందర్ గౌడ్, దానంపల్లి నారాగౌడ్‌పేట మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, దాచా సంగమేశ్వర్, పెరుమాండ్ల నర్సింలు చారి, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ అభిమానుల సంబురాలు



నవతెలంగాణ-బెజ్జంకి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా సినీ నటుడు కొణిదేల పవన్ కల్యాణ్ ఎన్నికవడంతో మండల కేంద్రంలో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహం చౌరస్తా వద్ద అయన అభిమానులు టపాసులు కాల్చి , మిఠాయిలు పంచుకొని సంబురాలు జరిపారు. భవిష్యత్తులో పవన్ కల్యాణ్ ప్రజలకు సేవ చేస్తూ ఉన్నత పదవులు పొందాలని బోనగిరి మల్లేశం అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చేరుకూరి సాయి క్రిష్ణ, మహేశ్, వీరేశం, శ్రీనివాస్, సునీల్, ప్రశాంత్, కొత్తగట్టు శ్రీనివాస్, ఉపేందర్ పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు..



నవతెలంగాణ-బెజ్జంకి

కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ భారీ మేజారీటితో ఎంపీగా ఎన్నివడంతో మండలంలోని అయా గ్రామాల్లో బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి మంగళవారం సంబురాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మండలాధ్యక్షుడు కొలిపాక రాజు, దాచారంలో దీటి రాజు, లక్ష్మిపూర్‌లో రెండ్ల అనిల్ అధ్వర్యంలో అయా గ్రామాల్లో బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేస్తూ సంబురాలు జరిపారు.

మండలంలో బీజేపీ అధిక్యం...

పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో బీజేపీ అధిక్యత సాధించడం అనందనీయమని మండలాధ్యక్షుడు కొలిపాక రాజు హర్షం వ్యక్తం చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుల గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థిపై సుమారు 100 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థిపై సుమారు 210 ఓట్ల అధిక్యత బీజేపీ అభ్యర్థి సాధించడం అభినందనీయమని భారీ మేజారీటితో బీజేపీ అభ్యర్థి ఎన్నికకు కృషి చేసిన బీజేపీ శ్రేణులకు కొలిపాక రాజు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు అభివృద్ధికి పట్టంకట్టారు

మండలంలో బీజేపీ శ్రేణుల సంబరాలు
సీనియర్ నాయకులు నత్తి మల్లేష్‌ముదిరాజ్



నవతెలంగాణ-మనోహరాబాద్

పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ప్రజలు డబ్బు మద్యంకు కాకుండా నిజాయితీ అభివృద్ధిని చూసి బీజేపికి పట్టం కట్టారని మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా రఘనందన్‌రావ్‌ను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పార్టీ సీనియర్ నాయర్ నాయకులు రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు బాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్‌లు పేర్కొన్నారు. మంగళవారం జరిగిన పార్లమెంట్ ఓట్ల లెక్కింపులో మెదక్ నుంచి బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావ్‌ను 33 వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందడంతో తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో బీజేపి శ్రేణులు భారీగా టపాసులను కాలుస్తూ సంబరాలను చేసుకున్నారు. ఈ సందర్భంగా మనోహరాబాద్ మండలం దండుపల్లి చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రజలు నిజాయితీగా ఎన్నికల్లో ఓట్లు వేశారని ఇతర పార్టీల వారు డబ్బు మద్యంతో పాటు ఎన్నో ప్రలోబాలకు పాల్పడినా ప్రజలు వారిని తిరస్కరించారని పేర్కొన్నారు. భారతదేశంలో మూడవ సారి ప్రధాన మంత్రిగా మోదీ బాధ్యతలు చేపట్టబోతున్నారని అలాగే రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి ధీటుగా 17 స్థానాల్లో 8 సీట్లను గెలుచుకుని సమం చేశారన్నారు. రాష్ట్రంలో 8 సీట్లు రావడానికి కృషి చేసిన బీజేపి నాయకులకు, పార్టీ సానుభూతి పరులకు ప్రజలకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీజేపి పార్టీ సత్తాను చాటుతుందని తెలిపారు. ప్రజలు తమపై నమ్మకంతో బీజేపిపై కమ్మకంతో పార్టీకి ఓట్లేసి గెలిపించారని వారి నమ్మకాన్ని వమ్ముకాకుండా వారికి ఎలాంటి సమస్యలు వచ్చినా వారికి వెన్నుదన్నుగా ఉండి పోరాడుతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి పార్టీ వైస్ ప్రసిడెంట్ జగన్, మాజీ సర్పంచ్ జక్కిడి నరెందర్‌రెడ్డి (బుల్లెట్ రాజు), నర్సింలు, మండల పార్టీ అధ్యక్షులు నరెందర్‌చారి, ఆంజనేయులు, రాజు ముదిరాజ్‌లతో పాటు అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో తూప్రాన్‌కు చెందిన వ్యాపారి అశోక్‌గుప్త ప్రజలందరికి స్వీట్లు తినిపంచి సంబరాలను చేపట్టారు. .

మహాత్మ జ్యోతి బాపూలే మహిళ గురుకులంలో ప్రవేశాలు



నవతెలంగాణ-వర్గల్ : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపూలే మహిళ గురుకులంలో డిగ్రీలో పలు కోర్సులకు ప్రవేశాలు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీ. భాస్కర్ రావు తెలిపారు. మహాత్మ జ్యోతి బాపూలే మహిళ గురుకులంలో 2024-05 విద్య సంవత్సరానికిగాను డిగ్రీలో బీఏ, బీఎస్సి పలు గ్రూపులలో సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు సంబంధిత ధ్రువ పత్రాలతో జూన్ 5 నుంచి 13 వరకు జాబితాలో చేరవచ్చని సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు వసతి, పాఠ్య పుస్తకాలు, దుస్తులు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవతెలంగాణ

సంగారెడ్డి

బుధవారం | 05 జూన్ 2024 | www.navatelangana.com

మధ్యలోనే కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయిన బీబీ పాటిల్

నవతెలంగాణ-జహీరాబాద్

బోధన్, బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గాల కౌంటింగ్ పూర్తయిన మరుక్షణమే బీజేపీ అభ్యర్థి బి.బి పాటిల్ తన అనుచరులతో కలసి కౌంటింగ్ కేంద్రం నుంచి మధ్యలోనే వెళ్లిపోయారు. తమకు బోధన్ నుంచి భారీ మెజార్టీ లభిస్తుందని ఆశపడగా.. అనుకున్న స్థాయిలో ఓట్లు రాకపోవడంతో.. నిరాశతో కౌంటింగ్ కేంద్రాన్ని వదిలి వెళ్లినట్టు సమాచారం.



సురేష్ షెట్కార్ గెలుపు బీజేపీ విధానాలకు చెంపపెట్టు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్ విజయం.. బీజేపీ విధానాలకు చెంపపెట్టు లాంటిదని ఓయూ జేఏసీ చైర్మెన్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు కర్ర రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ సురేష్ షెట్కర్‌కు పూలమాలవేసి విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్‌కు కర్రకాల్చి వాత పెడతామని ఎన్నికల ముందే చెప్పామని.. ఇప్పుడు సురేష్ షెట్కర్ విజయంతో అది నిజమైందన్నారు. ఈ విజయం ప్రజా విజయమన్నారు. ఈ కార్యక్రమంలో రాజు నాయక్, ప్రకాష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సవ సంబురాలు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్ విజయంతో పార్టీ శ్రేణులు ఘనంగా సంబురాలు జరిపారు. నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ యువజన నాయకులు శివకుమార్ అనుచరులతో స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తల పదేండ్ల కల నెరవేరిందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం ప్రజావిజయమన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



న్యాల్‌కల్ : సురేష్ షెట్కార్ విజయంతో.. మండలంలోని చాలా గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు పెద్ద ఎత్తున సంబురాలు జరిపారు. సంతోషంలో మిఠాయిలు తినిపించుకున్నారు. ఆయన గెలుపునకు కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.



కోహిర్ : మండలంలోని కోహిర్‌తో పాటు చాలా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు టపాకాయలు కాలుస్తూ సంబురాలు జరిపారు. భారీ మెజార్టీతో సురేష్ షెట్కార్ విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు రామలింగ రెడ్డి, మాజీ ఎంపీపీ శోకు తల్లి, కోహిర్ కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ శంసురల్లి, మాజీ టెంపుల్ చైర్మన్ రాచూరి రచయ్య, మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఉపసర్పంచ్ మోసిన్, ఆమెదు ముజాఫర్, అబ్దుల్, గని, హసన్, జావిద్, నాగేష్, సాయిలు, మునీరుద్దీన్, నసీర్ పటేల్ పాల్గొన్నారు.

కార్యకర్తల కష్టం ఫలించింది



నవతెలంగాణ-మునూర్

జహీరాబాద్ లోకసభ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపు కోసం ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కృషి చేశాడని.. వారి కష్టం ఫలించి సురేష్ షెట్కార్ భారీ మెజార్టీతో గెలుపొందాని మండలం యువజన నాయకులు పి మహిపాల్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని.. రాబోయే స్థానిక సంస్తల ఎన్నికల్లో కూడా విజయ దుందిభి మోగిస్తుందన్నారు. సురేష్ షెట్కార్ విజయానికి కృషి చేసిన ప్రతీ కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు.



ఫీజుల దోపిడిని అరికట్టాలి

- అనుమతుల్లేకుండా అడ్మిషన్ చేస్తున్న స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ డిమాండ్

నవతెలంగాణ-పటాన్‌చెరు

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న వేళ ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలో మహేష్ మాట్లాడుతూ.. జిల్లాలో అనుమతులు లేకుండా కొన్ని బడా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ అడ్మిషన్లు చేయడమే కాకుండా రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. అదేవిధంగా ఫీజులు హద్దుఅదుపు లేకుండా ఇష్టారీతిగా పెంచుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని పీల్చుకు తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పూర్తి చేసిన పదో తరగతి విద్యార్థుల దగ్గర నుండి టిసి, స్టడీ సర్టిఫికెట్, బోనఫైడ్ రూపంలో పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీంలో సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల విద్యార్థులకు 25శాతం ఉచితంగా విద్యను అందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విజయ్. అశోక్, రమేష్, అనుష, మౌనిక.హారిక, తదితరులు పాల్గొన్నారు.

జిన్నారంలో బీజేపీ సంబరాలు



నవతెలంగాణ-జిన్నారం

మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా మాధవనేని రఘునందన్ రావు గెలుపును పురస్కరించుకొని బీజేపీ శ్రేణులు బాణాసంచా కాలుస్తూ, నృత్యాలు చేస్తూ సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మండల నాయకులు ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, నర్సింగ్ రావు జగన్ రెడ్డి ఎంపీ లక్ష్మణరావు, సుధాకర్ రమేష్ వెంకటేష్ శ్రీనివాస్ రాజ భార్గవ్ జిన్నారం మండల బిజెపి శ్రేణులు పాల్గొన్నారు. మండలంలోని ఆయా ప్రాంతాల్లో బిజెపి శ్రేణులు రఘునందన్ రావు గెలుపును పురస్కరించుకొని సంబురాలు జరిపారు.

సురేష్ షెట్కార్ ఘన విజయం

నా విజయం కార్యకర్తలకు అంకితం - సురేష్ షెట్కార్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కర్ 47,896 ఓట్ల మెజార్టీతో సమీప బీజేపీ అభ్యర్థి బి.బి పాటిల్‌పై ఘన విజయం సాధించారు. పోస్టల్ ఓట్లలో కొంచెం వెనుకంజలో ఉన్నప్పటికీ.. బ్యాలెట్ ఓట్లు ప్రారంభం కాగానే రౌండ్.. రౌండ్‌కు సురేష్ షెట్కర్ ఆధిపత్యాన్ని సాధించారు. ప్రతీ రౌండ్‌లోనూ మెజార్టీ పెంచుకుంటూ విజయం దిశగా సాగారు. పోస్టల్ ఓట్లు 11,650 ఉండగా.. అందులో బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు 6207, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు 4499, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌కు 666 ఓట్లు పోలయ్యాయి. దాంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లల్లో బీజేపీ అభ్యర్థి 1708 మెజార్టీ సాధించారు. కాగా చదువుకున్న మేధావులైనప్పటికీ 84 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు రిజెక్ట్ అవ్వడం గమనార్హం. బ్యాలెట్ ఓట్లల్లో సురేష్ షెట్కార్‌కు 52,3919, బి.బి పాటిల్‌కు 47,6023, గాలి అనిల్ కుమార్‌కు 17,1412 ఓట్లు పోలవగా 47,896 మెజార్టీతో సురేష్ షెట్కర్ గెలిచారు.

నా విజయం కార్యకర్తలకే అంకితం : సురేష్ షట్కర్

మత రాజకీయాలు చేస్తున్న వారికి నా విజయం చెంపపెట్టు లాంటిదని.. ఇది కార్యకర్తలదరి విజయమని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. కూతురు గిరిజ షట్కార్, ముఖ్య నాయకులతో కౌంటింగ్ కేంద్రం వద్దకు వచ్చిన ఆయన.. విజయం అనంతరం మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రాహుల్ గాంధీ, సోనియా గాంధీ టికెటు కేటాయించడం.. తదుపరి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల కార్యకర్తలందరూ ఐక్యమత్యంతో పనిచేయడం వల్ల తనకు భారీ మెజార్టీతో వచ్చిందన్నారు. భారతదేశం మరొకసారి లౌకిక దేశంగా గుర్తింపు తెచ్చుకున్నదన్నారు. కేంద్రంలో కూడా తమ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మత రాజకీయాలు చేస్తున్న వారికి ప్రజలు మంచి గుణపాఠం చెప్పారన్నారు. జహీరా బాద్ నియోజకవర్గంలో ఉన్న మైనార్టీ సహోదరులు, దళితులు 90 శాతం ఓటు తనకు వేశారని వారందరికీ కృతజ్ఞ తలు తెలిపారు. బీసీలు ఇతర వర్గాలకు చెందిన వారికి కూడా ధన్యవాదాలు తెలిపారు. తన గెలుపునకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చంద్రశేఖర్, మహమ్మద్ తన్వీ ర్, ఉజ్వల్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, మహమ్మద్ ఖాజామియ, రషీద్‌లతోపాటు ప్రతీ కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు.

విజయ దుందుభి మోగించిన అనంతరం టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ నివాసంలో కార్యకర్తలు



శాలువాతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కతుబుద్దీన్, తాజోద్దీన్, జహంగీర్, అక్బర్, మోతిరామ్, రాములునేత, అక్రమ్,సందీప్, బాలిరెడ్డి, మజర్, రాము రెహన్‌తదితరులు పాల్గొన్నారు.



కట్టుదిట్టమైన భద్రత మధ్య కౌంటింగ్

- కౌంటింగ్‌లో ఆధునిక పరికరాల వినియోగం
- సిబ్బంది ఫోన్లు సైతం స్వాధీనం
- కీలక సిబ్బందికి వాకీటాకీ..
- మీడియా కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ కౌంటింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. పటాన్చెరు నియోజకవర్గంలోని రుద్రారం గ్రామ పరిధిలో గల గీతం యూనివర్సిటీలో కౌంటింగ్ ఏర్పాట్లను చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి కౌంటింగ్ సిబ్బంది, పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రానికి చేరుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల విధానంతో భద్రతా సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టడంతో పాసులు ఉన్నవారికి మాత్రమే లోపలికి అనుమతించారు. అభ్యర్థులు, ఏజెంట్ల మొబైల్ ఫోన్లు సైతం అనుమ తించకపోవడంతో లోపలి నుంచి ఎలాంటి సమాచారం బయటకి రాలేదు. ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వాకీటాకీ ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందవేస్తూ కౌంటింగ్ సజావుగా జరిగేందుకు చర్యలు చేపట్టారు.



జహీరాబాద్ పార్లమెంట్‌లో నారాయణఖేడ్,ఆందోల్, జుక్కల్, బాన్సువాడ, బోధన్,జహీరాబాద్, ఎల్లారెడ్డి అనే ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో 16,80,755 ఓట్లుఉండగా 12,25049 ఓట్లు పోలయ్యాయి.

మీడియా కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ రూపేష్..

రౌండ్ల వారిగా సమాచారాన్ని అందించకపోవడంతో ఒక దశలో పాత్రికేయులు ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడినప్పటికీ అక్కడ ఉన్న సిబ్బందికి అవగాహన లేకపోవడంతో సమాచారాన్ని పాత్రికేయులకు చేరవేయడంలో తీవ్ర అంతరాయం జరిగింది. రౌండ్ల వారీగా రిజల్ట్ ఇవ్వకపోవడం ఏ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ జరుగుతుందో వివరాలు సైతం సిబ్బంది మీడియా కేంద్రానికి చేర్చకపోవడంతో పాత్రికేయులు మీడియా సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు.

రౌండ్ల వారీగా టేబుల్‌ల వద్దకు వెళ్లి జిల్లా కలెక్టర్ ఈవీఎంలు నుంచి రిజల్ట్ తీసే విధానాన్ని పరిశీలించి సిబ్బందికి ఎక్కడ కూడా ఇబ్బంది జరగకుండా కట్టుదిట్టమైన చర్యలను చేపట్టారు.



పంచాయతీ నిధులకు గ్రహణం!

- ప్రత్యేక పాలనలో కార్యదర్శుల వెతలు
- గ్రామపంచాయతీలకు నిధుల కొరత
- సంతకాలకే పరిమితమైన ప్రత్యేక అధికారులు
- అప్పుల ఊబిలో పంచాయతీ కార్యదర్శులు
- ప్రతినెల జిపిలకు రావాల్సిన ఎస్ఎఫ్‌సీ నిధులు సుమారు రూ. 36.00 లక్షలకు పైగానే..

ప్రత్యేక పాలనలో గ్రామపంచాయతీల నిధులకు గ్రహణం పట్టింది. గ్రామాలకు నిధులు లేక నిస్తేజంగా మారాయి అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ముఖ్యంగా చిన్న గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉంది. చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేందుకు ట్రాక్టర్లలో డీజిల్ పోయడానికి కూడా డబ్బుల్లేని పరిస్థితి. పంచాయతీ భవనాల, నల్లాల బావులు, బోరు మోటార్లుకు కరెంటు బిల్లులు కట్టడానికి కూడా నిధుల్లేవని గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. రెండేళ్లుగా రాష్ట్ర ఆర్థిక సంఘం(ఎస్ఎఫ్సీ.)నిధులను సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో గ్రామ పంచాయతీల్లో తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

నవతెలంగాణ-ఝరాసంగం

జనవరిలో పంచాయతీల పదవి కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులతో విధులను నిర్వహిస్తోంది. పంచాయతీ కార్యదర్శి రోజువారి పనులు ఓవైపు నిర్వహణ మరోవైపు వారిని ఊక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రత్యేక అధికారులు వారి వారి కార్యాలయాల్లోనే ఉంటూ సంతకా లకే పరిమితమవుతున్నారు. ప్రత్యేక అధికారులకు తమ రోజువారి బాధ్యతలతో పాటు ప్రభుత్వం పంచాయతీల నిర్వహణ బాధ్యతను అదనంగా అప్పగించడంతో వారు అటు వైపు చూసేందుకు ఆసక్తి చూపడం లేదు. దాంతో పంచాయతీ కార్యదర్శులపై అధిక భారం అవ్వడంతో అయోమయానికి గురవుతున్నారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచులు లేకపోవడం వల్ల పంచాయతీ నిర్వహణ భారం కార్యదర్శులపై పడడంతో వారు అప్పుల పాలవుతున్నారు. జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు రావాల్సిన నిధులు రాకపోవడం, ఇతర ఆదాయ వనరుల్లేక పోవడంతో గ్రామాల్లో కనీస సమస్యలను కూడా పరిష్కరించే పరిస్థితి లేకుండా పోయిందని సంబంధిత అధికారులు చెబుతున్నాయి.

పనులు ఆగకుండా ఉండేందుకు డబ్బులు సర్దుబాటు..

ప్రత్యేక పాల కంటే ముందు గ్రామ పంచాయతీలకు సక్రమంగా నిధులు విడుదల చేయకపోయినా పాలకవర్గాలు ఉన్నపుడు సర్పంచులు ఏదో విధంగా డబ్బులు సర్దుబాటు చేసి పనులు ఆగకుండా చూసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో 2024 ఫిబ్రవరి 2 నుంచి పంచాయతీల్లో ప్రత్యేక పాలన ప్రారంభమైంది. కొన్ని చోట్ల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పనులు నిలిచిపోకుండా ఉండేందుకు డబ్బులు సర్దుబాటు చేసినప్పటికీ.. నెలల తరబడి పంచాయతీలను ఎలా నిర్వహించాలన్న దానిపై వారు అయోమయానికి గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా ప్రత్యేక అధికారుల పాలనలో రావని, మళ్లీ పంచాయతీల పాలకవర్గాలను ఎన్నుకున్న తర్వాతే కేంద్రం నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. గతంలో ఎస్.ఎఫ్.సి నిధులు రాకున్నా.. కేంద్రం ఇచ్చే నిధుల ద్వారా గ్రామాలలో పాలకవర్గాలు గ్రామ పంచా యతీలను నెట్టుకు వచ్చాయి. ప్రస్తుతం ఇటు రాష్ట్రం, అటు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో ఆదాయ వనరుల్లేని గ్రామాల పరిస్థితి ఎటు తోచని దయనీయంగా స్థితి లోకి చేరుకుంటున్నాయి.



నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం



చాలా రోజుల నుండి ఎస్ఎఫ్‌సి నిధులు గ్రామపంచాయతీలకు రావడం లేదు. 6 నెలల నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిఎ యాయి. చిన్న చిన్న పంచాయతీల్లో పంచాయతీ కార్మికుల జీతాలు కూడా చెల్లించలేకపోతున్నాం. గ్రామపంచాయతీలలో ప్రాథమిక అవసరాలకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

-సుధాకర్, ఎంపీడీవో ఝరాసంగం

పారిశుధ్య కార్మికుల ఒత్తిడి..

జీపీ ఖాతాల్లో నిధుల్లేక చాలా చోట్ల సిబ్బందికి వేతనాలు చెల్లించడం లేదు. ఫలితంగా కార్మికులు పనులు చేయడం లేదు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ప్రతి ఐదు వందల మంది జనాభాకు ఒక మల్టీపర్పస్ కార్మికుడిని నియమించే అవకాశం కల్పించింది. వీరు విద్యుత్ లైట్లు, పారిశుధ్యం, మురుగు కాల్వల్లో పూడిక తొలగింపు, చెత్త ట్రాక్టర్ నడిపించడం, మంచినీటి సరఫరా వంటి పనులు చేయాల్సి ఉంటుంది. వీరికి మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. ఇక, మేజర్ పంచాయతీల్లో అవసరమైనంత సంఖ్యలో పారిశుధ్య సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పనులు నిలిచిపోకుండా ఉండేం దుకు ప్రత్యేకంగా కూలీలను నియమించుకుంటే.. వారికి డబ్బులు చెల్లించడం కష్టంగా ఉంటోందని, ఇప్పటికే బకాయి వేతనాల కోసం కార్మికులు తమపై ఒత్తిడి తెస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన చెందుతున్నారు.

సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తే ప్రయోజనం



గ్రామాల్లో ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయతీల వైపు కన్నెత్తి చూడడం లేదు. వారి కార్యాలయాలకే పరిమితమై భారం మొత్తం పంచాయతీ కార్యదర్శులపై వదిలేస్తున్నారు. దానివల్ల పంచాయతీల నిర్వహణ భారం మొత్తం కార్యదర్శులపై పడుతోంది. ప్రత్యేక పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటు పడుతోంది. మాలాంటి చిన్న జీపీల పరిస్థితి మరీ దయ నీయంగా ఉంది. ప్రాథమిక అవసరాలకు కూడా తీర్చు కోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. వెంటనే సర్పంచ్ ఎన్నికలను నిర్వహిస్తే గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుంది.

-మాణిక్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ ప్యారవరం

వొక్సాన్ యూనివర్సిటీ గార్డెన్ వర్కర్ అదృశ్యం

నవతెలంగాణ-మునిపల్లి

మండల పరిధిలోని కంకోల్ గ్రామ శివారులో గల వొక్సాన్ యూనివర్సిటీలో గార్డెన్ వర్కర్ పనిచేస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులో వచ్చింది. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగమేశ్వర్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కంకోల్ గ్రామంలో నివాసం ఉంటూ వోక్సాన్ యూనివర్సిటీలో గత నాలు గేళ్లుగా గార్డెన్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. అయితే పనిలో భాగంగా ఆదివారం నైట్‌డ్యూటీ ఉండడంతో సాయంత్రం 6:30గంటలకు



ఇంటి నుంచి యూనివర్సిటీకి వెళ్లి.. ఆదివారం అర్ధరాత్రి 3గంటల వరకు పని చేసి అదృశ్యమయ్యాడు. సోమవారం రోజున ఇంటికి రాకపోవడంతో..కుటుంబ సభ్యులు బంధువుల వద్ద వెతికినా సంగమేశ్వర్ ఆచూకి లభించలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం రోజున సంగమేశ్వర్‌ను చూపించాలంటూ యూనివర్సిటీ గేటు ము oదు బాధితుడి కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. యూ నివ ర్సిటీ యాజమాన్యం పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సం ఘటన స్థలానికి చేరుకొని బాధితుడి కుటుంబ సభ్యులతో కలిసి యూనివర్సిటీని పరిశీలించారు. అతడు అదృశ్యమై ఉండొచ్చని కుటుంబ సభ్యులకు వివరించారు. దీంతో సంగమేశ్వర్ భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని కూరెళ్ళ గ్రామానికి చెందిన జాగిరి శ్రీనివాస్ (40) ఆదివారం తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు క్రింద పడగా రెండు కాళ్ళు విరిగిపోవడంతో పాటు తీవ్ర గాయాలపాలయ్యాడు. మంగళవారం వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జాగిరి శ్రీనివాస్ సాయంత్రం వేళలో కల్లు గీసేందుకు తాటి చెట్టు పైకి ఎక్కాడు. అదే సమయంలో గాలిదుమారం రావడంతో ప్రమాదవశాత్తు శ్రీనివాస్ కాలు జారి క్రింద పడి తీవ్రగాయాలపాలైనట్లు తెలిపారు. వెంటనే 108 ఆంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వైద్యులు రెండు కాళ్ళు విరిగిపోయాయని పేర్కొన్నారని శ్రీనివాస్ భార్య మంజుల తెలిపారు. బాధితుడిని, ఆయన కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భగీరథ పైప్ లైనుకు మరమ్మత్తు పనులు

నవతెలంగాణ స్పందన

నవతెలంగాణ-దుబ్బాక

నవతెలంగాణ' దినపత్రికలో ఈ నెల 3వ తేదిన "భగీరథ...నీరు వృధా..." అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. దుబ్బాక పురపాలిక కేంద్రం నుంచి హబ్షీపూర్ వెళ్లే దారిలో రామసముద్రం చెరువు కట్ట కింద మిషన్ భగీరథ పైప్ లైన్ నుంచి గత కొద్ది రోజులుగా నీరు వృధా పోతుంది. 'నవ తెలంగాణ' కథనానికి స్పందించిన అధికారులు వెంటనే మరమ్మతులు చేసి నీటి వృధాను అరికట్టారు.



డంప్‌యార్డును పరిశీలించిన రీజనల్ డైరెక్టర్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న డంపు యార్డును వరంగల్ రీజనల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌లో బయో మైనింగ్‌లో జరిగే రీసైకిలింగ్ చేస్తున్న పొడి వనరులను కాంపోస్టు ఎరువును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గోల్కొండ నరసయ్య ఏఈఈ కిష్టన్న, సానిటర్ ఇన్స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పును స్వాగతిస్తాం

నవతెలంగాణ-సిద్దిపేట



లోకసభ ఎన్నికల ఫలితాలలో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తామని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఎస్సి డిపార్ట్మెంట్ చైర్మన్ కొమ్ము విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గెలిచిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజమని, తెలంగాణలో బీజేపీని గెలిపించడానికి బీఆర్ఎస్ పార్టీ ఆత్మాహుతి అయ్యిందని ఏద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు, ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

రాజకీయాల్లో గెలుపోటములు సహజం

- మెజారిటీ అందించిన మండల ప్రజలకు ధన్యవాదాలు.

నవతెలంగాణ-తొగుట



రాజకీయాల్లో గెలుపోటములు సాధారణమని, ఓటమిని భవిష్యత్ గెలుపుకోసం అవకాశంగా తీసుకుంటామని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. మెదక్ పార్ల మెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామరెడ్డి ఓటమి చెందడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ పార్టీ చరిత్రలో గెలిచినప్పుడు వీర్రవిగలేదు ఓటమి జరిగినప్పుడు కృంగిపోలేదన్నారు. భవిష్యత్‌లో బీఆర్ఎస్ పార్టీ పుంజుకోవడం ఖాయమన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తామన్నారు. ఎన్నికల్లో కృషి చేసిన పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రఘునందన్ గెలుపుతో బీజేపీ శ్రేణుల సంబరాలు



నవ తెలంగాణ-మిరుదొడ్డి

మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా రఘునందన్ రావు గెలుపొందిన నేపథ్యంలో మంగళవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చారు. మిఠాయిలు ఒకరికొకరు పంచుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు దేవరాజు, దళిత మోర్చా జిల్లా నాయకులు రోశయ్య, మల్లేశంలు మాట్లాడుతూ రఘునందన్ రావు ఎంపీగా గెలుపదడం ఎంతో సంతోషకరమన్నారు. పేద ప్రజలకు సేవ చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి రఘునందన్ రావు ఎల్లవేళలా ప్రశ్నిస్తూ ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలే ఈ అవకాశాన్ని కల్పించి ఎంపీగా గెలిపించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కనకరాజు స్వామి గొట్టం కృష్ణ మల్లేశంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



నవతెలంగాణ-నిజాంపేట

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు గెలుపొందడంతో మండల కేంద్రంలో సోమవారం మండల బీజేపీ నాయకులు టపాకాయలు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చిమ్మనమైన చంద్రశేఖర్ మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గ అభ్యర్థి రఘునందన్ రావు విజయం తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడబోతుందని ముచ్చటగా మూడవసారి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం చేయబోతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్ మహంకాళి, ఆకుల రమేష్, జాల పోచయ్య జిపి స్వామి, సీద్దరాం రెడ్డి, అబ్దుల్ పాషా, మవూరం లక్ష్మణ్, అనుపాటి రాజిరెడ్డి, గేరిగంటి బాబు, పంజా బాబు, కుమార్, స్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌లో పెండింగ్ పనులు పూర్తి చేయరా?

- పెండింగ్ పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పెండింగ్ పనులుతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు నిధులు మంజూరు చేసినప్పటికీ ఆ పనులు కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు కాకపోవడంతో నిలిపివేశారు. మరికొన్ని పనులు ప్రభుత్వం నిధులను ఖర్చు చేయవద్దని ఆదేశాలు ఇవ్వడంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో పనులు పెండింగ్లో పడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలకు వస్తున్నప్పటికీ గజ్వేల్‌లో పెండింగ్లో ఉన్న పనులపై దృష్టి పెట్టలేక పోతుంది. మరోపక్క పార్లమెంటు ఎన్నికల కోడ్ ఉన్నందున కొంత ఇబ్బంది అయింది. జూన్ 4తో పార్లమెంటు ఓట్ల లెక్కింపు పూర్తి కావడంతో వారం లోపే కోడు పోతుంది. కాబట్టి కొత్త పనులపై ముఖ్యంగా పెండింగ్ పనులపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతిపాదనల అంశం తెరపైకి వస్తోంది. సీసీ రోడ్ల కోసం గతంలో రూ.120 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు కేవలం రూ.22.87కోట్లను మాత్రమే విడుదలయ్యాయి. వరద కాల్వల నిర్మాణం కోసం నీటిపారుదల శాఖ ప్రతిపాదించిన రూ.15 కోట్ల వ్యవహారం కూడా కొలిక్కిరాలేదు. ఇవే కాదు మరెన్నో అంశాల్లో ముందడుగు పడటం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విడుదలైన నిధుల మంజూరు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అంతర్గత రోడ్లు సక్రమంగా లేక ప్రజలు నానా ఇబ్బం దులు పడుతున్నారు. 20వార్డుల్లో చాలావరకు కాలనీల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. ఏడాదిన్నర క్రితం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 80 కిలోమీటర్ల పొడవున సీసీ రోడ్లకు రూ.120 కోట్ల నిధులు అవసరమని ప్రతిపాదించారు. కేవలం రూ.22.87కోట్లు మాత్రమే ప్రభుత్వం విడదల చేసింది. దీంతో పనులు ముందుకు సాగడంలేదు. వరద కాల్వల ప్రతిపాదన సైతం. మున్సిపాలిటీ పరిధిలో వరద కాల్వల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఏళ్లతరబడి అతీగతీ లేకుండా పోయింది.

అధ్వాసంగా అంతర్గత రోడ్లు

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ప్రజ్ఞాపూర్ రహదారికి ఏటా వానాకాలంలో వరద ముప్పు తప్పడం లేదు. ప్రధానంగా ప్రజ్ఞాపూర్ ఊరచెరువు మత్తడి దుంకితే. ఆ నీరు వెళ్లడానికి అవసరమైన నాలాల వ్యవస్థ లేదు. నిజానికి ఈ వరద నీరు నాలాల ద్వారా రాజిరెడ్డిపల్లి కుంటలోకి అక్కడి నుంచి క్యాసారం చెరువులోకి వెళ్లాల్సి ఉంటుంది. కానీ నీరు వెళ్లే మార్గం లేక అక్కడి నుంచి ఇళ్ల మధ్య నుంచే వరద నీరు కొట్టుకు వస్తోంది. ఇదే నీరు పార్థీవేశ్వరస్వామి ఆలయం ఆర్చి వద్ద రోడ్డు పైకి వచ్చి జలమయంగా మారుతోంది. వర్షా కాలంలో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న అండర్ డ్రైనేజీ గుండా వరద నీరు వేళ్లే విధంగా ప్రత్యేక నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం రూ.12.8 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అదేవిధంగా ఎర్రకుంట నుంచి పాండవుల చెరువు ఫీడర్ చానెల్ నిర్మాణానికి మరో రూ.2కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రెండు ప్రతిపాదనలకు ఆమోదం వస్తేనే పట్టణంలో వరద ముప్పునకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. కానీ ప్రతిపాదనలకు ఏళ్ల తరబడి మోక్షం లేకపోవడం వల్ల ఏటా వరద కష్టాలు పరిపాటిగా మారాయి. దీంతోపాటుగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాల్లో రూ.49కోట్లతో చేపట్టాల్సిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనుల ప్రతిపాదన ముందుకు సాగడంలేదు. పనుల్లోనూ నిర్లక్ష్యం మున్సిపాలిటీ పరిధిలో సుందరీకరించాలనుకున్న ఆరు జంక్షన్లలో కేవలం అంబేడ్కర్ చౌరస్తా, తూప్రాన్ రోడ్డు వై జంక్షన్, ముట్రాజ్పల్లి వద్ద మాత్రమే పనులు పూర్తి చేశారు. జాలిగామ బైపాస్ చౌరస్తా, ఇందిరాపార్కు చౌరస్తా, ఐఓసీ వద్ద చేపట్టాల్సిన పనులపై రెండేళ్లుగా నిర్లక్ష్యం నెలకొంది. రాజకీయ కారణాలతో ఈ పరిస్థితి నెలకొన్నదనే విమర్శలున్నాయి. కాగా పెండింగ్ ప్రతిపాదనలకు సంబంధించి కొత్త ప్రభుత్వం స్పందనపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. నిధులు విడుదల చేసి ఇబ్బందులు తీరుస్తారనే ఆశతో ప్రజలు ఎదురుచూ స్తున్నారు. ఇటీవల గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి దృష్టికి స్థానిక కాంగ్రెస్ నాయకులు తీసుకుపోయి పెండింగ్ పనులను పరిశీలించారు. పరిష్కారానికి కృషి చేద్దామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.





ఆదాయం పెంచే మార్గాలపై లక్ష్యం పెట్టాలి...!

- సిద్దిపేట డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

గ్రామీణ ప్రాంతంలోని మహిళలు ఆదాయం పెంచుకునే మార్గాలను ఎంచుకొని లక్ష్యంతో పనిచేస్తే ఆర్థికంగా ఎదుగుతారని సిద్దిపేట డిఆర్‌డిఓ జయదేవ్ ఆర్య అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లో టిటిసి భవన్‌లో మగ్గం వర్కర్స్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండి సమాజాభివృద్ధికిలో ముఖ్య భూమికను పోషిస్తున్నారన్నారు. జిల్లాల్లో డిమాండ్ ఉన్న కోర్సులను ఎంపిక చేసి గ్రామీణ ప్రాంతాల యువతకు నైపుణ్య శిక్షణలు ఇస్తున్నామని చెప్పారు. నైపుణ్య కేంద్రాలే కాకుండా మానవ సంబంధాలు, వ్యాపార నిర్వహణ మెలకువలు కూడా నేర్పియడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో అర్హులైన వారికి వివిధ పథకాల ద్వారా ఋణాలు ఇప్పించే బాధ్యత లీడ్ బ్యాంక్ ద్వారా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్‌డిఓ బాలకిషన్, సతీష్, ఎంపీడీవో వేణు గోపాల్ రెడ్డి, డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ కర్ణాకర్, ఎపియం శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. టైలరింగ్ యూనిట్ సెంటర్‌ను సందర్శించిన





డిఆర్‌డిఓ జయదేవ్ ఆర్య హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలోని శ్రీ శక్తి స్వశక్తి టైలరింగ్ యూనిట్‌ను సిద్దిపేట డిఆర్డిఓ జయదేవ్ ఆర్య సందర్శించారు. స్కూల్ పిల్లలకు యునీఫామ్స్ తొందరగా అందించాలని తెలిపారు.

యన్‌సీసీ క్యాంప్‌లో యువతులకు ఋతుచక్రంపై అవగాహన

- సమస్యల పరిష్కారానికి యువతులకు దిశ నిర్దేశం
- స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ పద్మాజ్యోతి

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

గజ్వేల్ బాలుర హబ్‌లో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యన్‌సీసీ సంయుక్త శిక్షణా శిబిరం నాల్గవ రోజు శిక్షణ ఉదయం యోగాతో మొదలైందని క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్ రావు తెలిపారు. మంగళవారం ఎన్‌సీసీ సంయుక్త శిక్షణ శిబిరంలో ఋతుచక్రం సమస్యలపై డాక్టర్‌తో అవగాహన కల్పించారు. ఆయుధ కవాతు, ఫైరింగ్, అవగాహన కార్యమాలు, క్రీడా మరియు సాంస్కృతిక పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉదయం క్యాంప్ నందు గజ్వేల్ ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ పద్మజ్యోతి ముఖ్య వక్తగా యన్‌సీసీ అమ్మాయిలకు నెలసరి సమస్యలు వాటి పరిష్కారాలు అనే అంశంపై వివరణతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా క్యాంప్ శిక్షణలో గజ్వేల్ అగ్నిమాపక బృందం అధికారి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల గురించి వివరించారు. వాటిని ఎదుర్కునే మార్గాల గురించి ప్రత్యక్షంగా డేమో తరగతుల ద్వారా వివరించడం జరిగిందన్నారు. అంతేకాకుండా రాజగోపాల్ పేట ఫైరింగ్ రేంజ్ వద్దకు దాదాపు మంది కాడేట్లు హాజరైనట్లు యన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ యాదగిరి తెలిపారు. కాడెట్‌లకు నిజమైన ఫైరింగ్‌లో నిపుణత పొందడానికి క్యాంప్‌లో సిములేటర్ ఫైరింగ్ ద్వారా కూడా శిక్షణ అందిస్తున్నట్లు క్యాంప్ డిప్యూటీ క్యాంప్ కమ్మాడంట్ కెప్టెన్ డాక్టర్ భవాని తెలిపారు.







జగదేవపూర్‌లో బీజేపీ నాయకుల సంబురాలు

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం టపకాయలు కాల్చి సంబురాలు చేసుకున్నారు. మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు గెలుపొందడంతో జగదేపూర్ మండల కేంద్రంలో గల స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు గుజ్జం శ్రీధర్ మాట్లాడుతూ మండల అధ్యక్షుడు ఐలయ్య మాట్లాడుతూ బీజేపీ విజయానికి కష్టపడిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు. బీజేపీ గెలుపు నాయకుల గెలుపు కాదని ప్రతి కార్యకర్త గెలుపు అని తెలియజేశారు. యావత్ దేశ ప్రధానికి సిద్దిపేట జిల్లా ప్రజల పక్షాల విజయాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గణేష్, కుమార్, కర్ణాకర్, చంద్రశేఖర్ రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ కుమార్ రెడ్డి విజయం పట్ల హర్షం

నవతెలంగాణ-మద్దూరు



భువనగిరి ఎంపీగా చామల కిరణ్ కుమార్ రెడ్డి విజయం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ మద్దూరు మండల అధ్యక్షుడు మేక మల్లేశం అన్నారు. మండలం నుంచి కిరణ్ కుమార్ రెడ్డికి 2317 మెజార్టీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గ్రామాల వారిగా మద్దూరు 650, సలాక్‌పూర్ 364, లద్నూర్ 312, మర్మముల 270, రేబర్తి 219, గాగిల్లాపూర్ 201, నర్సాయపల్లి 172, వంగపల్లి 48, మల్లంపట్ల 45, ధర్మారం 36, ఓట్లుగా మెజార్టీ వచ్చినట్లు ఆయన తెలిపారు. శ్యామల కిరణ్ కుమార్ రెడ్డి విజయానికి కృషి చేసిన జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి జిల్లా, మండల, నాయకులకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

నవతెలంగాణ-నంగునూరు

రాజకీయాల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఓటమికి కృంగిపోవడం లేదని, ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేసిన నంగునూరు మండల, మెదక్ పార్లమెంటు నియోజకవర్గ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటు ఎన్నికలు కావడంతో జాతీయ పార్టీల ప్రభావంతో అనూహ్య ఫలితాలు రావడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి గెలుపోటములు కొత్తవి కావని, టిఆర్ఎస్ 23 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో గెలుపోటములు చూడటం జరిగిందన్నారు. కేవలం 10 ఏళ్లలో తెలంగాణను దేశంలోనే అభివృద్ధి, సంక్షేమంలో ముందు నిలిపిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

ఢిల్లీలో మోదీ... మెదక్‌లో రఘునందన్

- బీఆర్ఎస్ కాంగ్రెస్ లను బొంద పెట్టిన
- మెదక్ ప్రజానీకం కే.సుభాష్ రెడ్డి

నవతెలంగాణ-దుబ్బాక

దేశ రక్షణ ప్రధాని మోదీతోనే సాధ్యమని...మరోసారి ఢిల్లీలో మోదీకి, మెదక్‌లో రఘునందన్ రావుకు పట్టం కట్టారని, ఇది దేశ ప్రజల విజయమని బీజేపీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు కిష్టమ్మగారి సుభాష్ రెడ్డి అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, 6 నెలల కాంగ్రెస్ పాలన పట్ల విసుగుచెందిన మెదక్ ప్రజానీకం బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను బొంద పెట్టారని విమర్శించారు. మంగళవారం వెలువడిన లోక్ సభ ఫలితాల్లో బీజేపీ మెదక్ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు ఎంపీగా గెలిచిన సందర్భంగా దుబ్బాక పురపాలిక కేంద్రంలోని బస్టాండ్ ఎదుట బీజేపీ శ్రేణులు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టుకున్నారు. రఘునందన్ రావు విజయం చారిత్రాత్మకమని, రాబోవు రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మెదక్ ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నాయకులు సుంకు ప్రవీణ్, రమేష్ రెడ్డి, బాచి, బాబు, రాజేష్, రవి, కిషన్, సప్తగిరి, సంతోష్, సంజీవ్ పలువురు పాల్గొన్నారు



రానున్న రోజుల్లో టీడీపీకి తెలంగాణలో పూర్వ వైభవము

నవతెలంగాణ-సిద్దిపేట



రాబోయే రోజుల్లో టీడీపీ తెలంగాణలో పూర్వ వైభవం సంతరించుకుంటుందినీ మాజి టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రమేష్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ ఘన విజయం సాధించిచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, టీఎన్ఎస్ఎఫ్ అధ్వర్యంలో స్వీట్లు పంచుకుంటూ, టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ను చిత్తుచిత్తుగా ప్రజలు ఓడించారన్నారు. త్వరలోనే టీడీపీ తెలంగాణలో పూర్వ వైభవము సంతరించుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ మాజీ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మకమైన తెలుగు దినపత్రిక
4
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం 05 జూన్ 2024 www.navatelangana.com

భువనగిరి ఎంపీ చామల గెలుపుతో సంబరాలు



నవతెలంగాణ-మద్దూరు

భువనగిరి ఎంపీగా చామల కిరణ్ కుమార్ రెడ్డి, గెలుపొందడంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, జిల్లా నాయకులు కామిడీ జీవన్ రెడ్డి, జక్కి రెడ్డి సుదర్శన్ రెడ్డిల ఆధ్వర్యంలో బాణా సంచాలు కాల్చి కాంగ్రెస్ మండల నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జీవన్ రెడ్డి, మారెళ్ళ భాస్కర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, మండల ప్రధాన కార్యదర్శి ఉట్ల శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి బూరుగు శంకర్, పిఏసిఎస్ డైరెక్టర్ కాటం బాలయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎఫ్ఎం షౌకత్ అలీ, నాయకులు తాజ్ మహమ్మద్, ఎండి పసి అహ్మద్, ముంతాజ్, ఎండి నవీద్, నీరటి కిషోర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నత్త నడకన రాంపూర్ నందగోకుల్ స్కూల్ పనులు





నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేసి పాఠశాలలను సకల సౌకర్యాలతో తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో పాఠశాలలకు నిధులను కేటాయించడం జరిగింది. అందులో భాగంగానే నందగోకుల్ పాఠశాలకు రూ. 8.44,000, రాంపూర్ పాఠశాలకు రూ. 3.45,000 కేటాయించడం జరిగింది. జూన్ 5 వరకు పాఠశాల పనులను పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లు నత్తనడకన పని కొనసాగిస్తున్నారని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. నంద గోకుల్ పాఠశాలలో బిల్డింగుకు ప్లాస్టర్ పనులు ఇప్పటికీ మొదలు పెట్టలేదు. రాంపూర్ పాఠశాలలో సంపు కోసం రింగులు మాత్రమే దించారని పనులు కొనసాగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పనులు త్వరగా పూర్తిచేసేలా తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టీడీపీ విజయంతో అభిమానుల సంబరాలు



నవతెలంగాణ-వర్గల్

మండల కేంద్రంలోని అంబెద్కర్ చౌరస్తాలో టీడీపీ అభిమానులు సంబరాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి విజయం సాధించిన సందర్భంగా వర్గల్‌లోని తెలుగుదేశం పార్టీ అభిమానులు బాణాసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు నేటి నుంచి మంచిరోజులు రానున్నాయని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సంబరాల్లో టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం.

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

బాలుర విద్యా సౌధంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం ఏకనామిక్స్ బోధించుటకు అతిథి అధ్యాపకులు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎ.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత సబ్జెక్టులలో ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతంతో, బీసీ, ఓసీ లైతే 55 శాతంతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే నెట్, సెట్ పాసైన వారికి, పిహెచ్.డి. పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ నెల 07న ఉదయం 11-00 గంటలకు ఇంటర్వ్యూ, డెమో క్లాసుల ద్వారా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. కాబట్టి అర్హతగల అభ్యర్థులు అన్ని ధృవీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీతో హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

వాగునూతిలో బీజేపీ విజయోత్సవ సంబరాలు



నవతెలంగాణ-ములుగు

వాగునూతిలో ప్రధాన కూడలి వద్ద బాణాసంచి కాల్చి ఒకరికిఒకరు స్వీట్లు తినిపించుకుని బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. జై బీజేపీ జై రఘునందన్ రావు అని నినాదాలు చేశారు, మెదక్ గడ్డ బీజేపీ అడ్డ అని నినాదాలు చేశారు. ములుగు మండల బీజేపి మాజీ అధ్యక్షులు పల్లె రమేష్, బూత్ అధ్యక్షులు, వెంకటేష్, ఆనంద్, పెంటయ్య, మధు, ప్రవీణ్, మల్లేష్, మణికంఠ మండల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న నవీన్‌కు చెలిమి భరోసా



నవతెలంగాణ-రాయపోల్

గత పది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఆర్టీసీ తాత్కాలిక డ్రైవర్ బ్యాగరి నవీన్ కుమార్ కుటుంబానికి చెలిమి ఫౌండేషన్ భరోసాను కల్పించింది. మంగళవారం రాయపోల్ మండల కేంద్రంలో నవీన్ కుమార్ కుటుంబానికి చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు గుర్రం తులసి దాస్ నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండల కేంద్రానికి చెందిన బ్యాగరి నవన్ కుమార్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్ డిపోలో తాత్కాలిక ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ ఉండేవాడు. గత సంవత్సరం ఆగస్టు 15 రోజున గజ్వేల్ నుంచి సికింద్రాబాద్ బస్సు డ్రైవర్‌గా ప్రయాణికులతో ప్రయాణం చేస్తుండగా తుర్కపల్లి వద్ద రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదంలో కండక్టర్ మృతి చెందగా నవీన్ తలకు, కాళ్ళు, చేతులకు తీవ్ర గాయాలు కాగా నడుము విరిగి కాళ్ల నడవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యారు. ఇప్పటికి చికిత్స పొందుతున్నాడు. నవీన్ ఆసుపత్రి ఖర్చుల కోసం వారికి ఉన్న కొద్దిపాటి వ్యవసాయ పొలంను కూడా అమ్మివేసి వైద్యం చేస్తున్నారు. నవీన్ కు తల్లిదండ్రులు కలమ్మ, నాదం, చెల్లి నవనీత, భార్య హరిత పిల్లలు లక్షిత్, భార్గవ్‌లు ఉన్నారు. వీరికి ఇల్లు తప్ప ఎటువంటి ఆధారం లేదని చెలిమి ఫౌండేషన్ దృష్టికి రాగా వారికి రూ.3500 విలువ గల నిత్యావసర సరుకులు, రూ.11,500 నగదు అందచేయటం జరిగిందన్నారు. చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తమకు తోచిన సహాయం అందజేయడం జరిగిందని ఇంకా మానవతావాదులు, స్వచ్ఛంద సంస్థలు ఎవరైనా మానవత్వంతో నవీన్ వైద్య ఖర్చుల కోసం వారికి తోచిన సహాయం చేసి ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెలిమి ఫౌండేషన్ కోశాధికారి దొంతుల ఆనంద్, తంగలపల్లి భగవంతు, టెంట్ నర్సింలు, నాగపురి రమేష్, పెద్దూరీ శ్రీనివాస్, చేపూరి సంతోష్, యాట ఆంజనేయులు, మంగళం పల్లి నర్సింహారావు, గ్రామస్తులు జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎమ్మెల్యే... ఎమ్మెల్యే ఎంపీ అయ్యారు

నవతెలంగాణ-దుబ్బాక

తొమ్మిదేళ్లుగా మెదక్ ఎంపీగా కొనసాగిన కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రస్తుతం దుబ్బాక ఎమ్మెల్యే అయ్యారు. మూడేళ్లుగా దుబ్బాక ఎమ్మెల్యేగా కొనసాగిన మాధవనేని రఘునందన్ రావు ప్రస్తుతం మెదక్ ఎంపీగా గెలుపొందారు. విచిత్రం ఏంటంటే ఎంపీగా ఉన్న ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే అయ్యారు. ఎమ్మెల్యేగా కొనసాగిన రఘునందన్ రావు ఎంపీ అయ్యారు.



ఎంపీ నుంచి ఎమ్మెల్యేగా...

మెదక్ ఎంపీగా (2014, 2019 లో) రెండు దఫాలుగా కొనసాగిన కొత్త ప్రభాకర్ రెడ్డి 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక ఎమ్మెల్యేగా తన సమీప ప్రత్యర్థి రఘునందన్ రావుపై 53,513 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.



ఎమ్మెల్యే నుంచి ఎంపీగా...

2020లో జరిగిన ఉప ఎన్నికలో మాధవనేని రఘునందన్ దుబ్బాక ఎమ్మెల్యేగా 1074 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అయితే 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన రఘునందన్ రావు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి చేతిలో పరాజితులయ్యారు. అయినా నిరాశ చెందకుండా, మొక్కవోని దీక్షతో ఈ ఏడాది మే 13న జరిగిన లోక్ సభ ఎన్నికల్లో మెదక్ లోక్ సభ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన దుబ్బాక మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు మెదక్ ఎంపీగా గెలుపొందారు.

సిద్దిపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ హవాకు బ్రేకులు

- బీజేపీ, బీఆర్ఎస్ మధ్య హెూరాహెూరీగా ఓటు పోలింగ్



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ రాష్ట్రంలో సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట అని చెప్పుకోవచ్చు. ఇక్కడ ఏ ఎన్నికల జరిగినా బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజలు తమ ఓట్ల రూపంలో మద్దతు చాటుతారు. కానీ మే 13న జరిగిన లోకసభ ఎన్నికలలో మాత్రం ఓటర్లు గతం కంటే ఈసారి బీజేపీకి మద్దతు చాటారని చెప్పవచ్చు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాం రెడ్డికి మద్దతుగా నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులు ప్రచారం నిర్వహించారు. కానీ ఎన్నికల ఫలితాలు చూస్తుంటే వారి ప్రచారం ఏమాత్రం ప్రజలపైన ప్రభావం చూపినట్టు కనిపించడం లేదు. బీజేపీ హవా, నరేంద్ర మోడీ చేసిన పనులు, రామ మందిరం నిర్మాణం, ఇంటింటికి రాముని అక్షంతలు పంపిణీ ప్రభావం ఓట్ల రూపంలో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుకు కలిసి వచ్చిందని చెప్పవచ్చు. సిద్దిపేట నియోజకవర్గంలో కేవలం 2,678 ఓట్లు ఆధిక్యత మాత్రమే రఘునందన్ రావుపై వెంకట్ రామ్ రెడ్డి సాధించారు. ఈ ఆధిక్యత చాలా తక్కువ అని చెప్పుకోవచ్చు. నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్ రావు సుమారు 82 వేల మెజార్టీతో విజయం సాధించాడు. కానీ ఆ మెజార్టీ, ఆ నమ్మకం ఈ లోకసభ ఫలితాలలో కనపడలేదు.



బీఆర్ఎస్‌కు గతం కంటే తక్కువ మెజార్టీ

బీఆర్ఎస్ పార్టీకి గత లోకసభ ఎన్నికలలో వచ్చిన మెజార్టీ కంటే ఈసారి వచ్చిన మెజార్టీ చూస్తుంటే చాలా నామ మాత్రమే అని చెప్పవచ్చు. గతంలో జరిగిన లోకసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీచేసిన కొత్త ప్రభాకర్ రెడ్డికి సిద్దిపేట అసెంబ్లీలో 78 వేలకు పైగా ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుకు 30 వేలకు పైగా ఓట్లు పోలయ్యాయి. కాగా 48 వేల ఓట్ల మెజార్టీ ప్రభాకర్ రెడ్డి క రావడం జరిగింది. ఈసారి జరిగిన లోకసభ ఎన్నికల్లో 20 రౌండ్లలో బిజెపి, బీఆర్ఎస్ మధ్య ఓట్ల తేడా చాలా స్వల్పంగా కనబడింది. 20 రౌండ్లలో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుకు 62,823 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డికి 65,501 ఓట్లు వచ్చాయి. కేవలం 2,678 ఓట్ల మెజార్టీని రఘునందన్ రావు పై వెంకట్రామిరెడ్డి పై చేయి సాధించారు. ఈ ఫలితాలను చూస్తుంటే సిద్దిపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ హవాకు బ్రేకులు పడిందని చెప్పవచ్చు. ప్రజలు కూడా పది సంవత్సరాల పాలనను అందించిన బీఆర్ఎస్‌ను దేశానికి జరిగిన ఎన్నికలలో ఆదరణ చూపలేదని చెప్పవచ్చు.

నామినేటెడ్ పదవుల పందేరం ప్రారంభం

- కీలక పదవులను దక్కించుకునేందుకు నేతల ప్రయత్నం

నవతెలంగాణ-గజ్వేల్

పార్లమెంట్ ఎన్నికలు జూన్ 4 కౌంటింగ్‌తో పూర్తయింది. ఇక నామినేట్ పదవులపై దృష్టి పెట్టాలని స్థానిక నియోజకవర్గ ఇన్చార్జిలు ప్రయత్నాలు చేస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గంతో పాటు సిద్దిపేట జిల్లాలో ఉన్న నామినేటెడ్ పదులపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. గజ్వేల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యేగా సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డి కొనసాగుతున్నారు. పదేళ్ల అధికారానికి దూరమై సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల పోటీ తీవ్రంగా ఉంది. పార్టీని పట్టుకొని ఉన్న సీనియర్లు తమకు నామినేటెడ్ పదవులను కేటాయించాలని ప్రయత్నాలను ముమ్మరం చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ సీఎం కేసీఆర్ గెలుపొందగా కాంగ్రెస్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని మార్కెట్ కమిటీలు, దేవస్థానాల అభివృద్ధి పాలకవర్గాల నియామకం కోసం స్థానిక నాయకుల వత్తిడితో సమాలోచన జరుపుతున్నట్లు తెలిసింది. గజ్వేల్ నియోజకవర్గం రాష్ట్రంలో కీలకంగా మారింది. మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గం కావడంతో అందరి దృష్టి నియోజకవర్గంపై కేంద్రీకృతం అవుతుంది. ప్రోటోకాల్ కోసం నామినేటెడ్ పదవులు కేటాయించి తమ వారిని ప్రజల్లోకి పంపాలని అధికార పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానికంగా ఉన్న నామినేటెడ్ పదవులను ముఖ్య నాయకులు చాలామంది ఆశీస్తుండడంతో స్థానిక నాయకుడు నర్సారెడ్డి ఆయా నాయకులతో సమాలోచనలు జరుపుతున్నట్లు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ వర్గాలు క్రియాశీలకంగా పాల్గొనడం కోసం అధిష్టానం తగిన సూచనలు చేస్తుండగా మరోవైపు నామినేటెడ్ పదవులను దక్కించుకోవడం కోసం స్థానిక నాయకులు పోటీ పడుతున్నారు. ఇప్పటికే నర్సారెడ్డిని సంప్రదించి తమకు సదరు పదవిని కట్టబెట్టాలని కోరుతున్నారు. సోషల్ మీడియాను వేదికగా చేసుకొని తమ అభిప్రాయాలను ప్రజల్లోకి పంపుతున్నారు.



నామినేటెడ్ పదవులు కీలకమే

గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి కీలకంగా మారిన నామినేటెడ్ పదవులు దక్కించుకోవాలని పలువురు సీనియర్ నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. గజ్వేల్, వంటిమామిడి, తూప్రాన్, కొండపాక, మార్కెట్ కమిటీలతో పాటు నాచారం, కొండపోచమ్మ దేవస్థానాల పాలకమండళ్ళ చైర్మన్ పదవులను సొంతం చేసుకోవడం కోసం స్థానిక నాయకులు ప్రయత్నిస్తున్నారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ ఓసి జనరల్ కాగా ఒంటిమామిడి మార్కెట్ కమిటీ ఎస్సీలకు రిజర్వ్ అయింది. దీంతో ఆయా వర్గాల నుంచి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం స్థానిక నాయకులు నాయిని యాదగిరి, గొల్లపల్లి నరేందర్ రెడ్డి, బయ్యారం మల్లారెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు సర్దార్ ఖాన్, గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు, ఇతరులు ప్రయత్నం చేస్తున్నారు. అదేవిధంగా జగదేవ్పూర్ మండలంలోని మరికొందరు సీనియర్ కూడా పదవులు ఆశిస్తున్నారు. వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మోహన్ తో పాటు పోశయ్య మరి కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారు. వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ చైర్మన్‌గా చేపూరు మోహన్‌తో పాటు మరికొంతమంది ప్రయత్నం చేస్తుండగా కొండపోచమ్మ దేవాలయం తదితర నామినేటెడ్ పదవులకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు.

మార్కెట్ కమిటీ రిజర్వేషన్లు

గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ జనరల్ స్థానానికి కేటాయించారు. గజ్వేల్ నియోజకవర్గంలో పెద్ద నామినేట్ పదవి ఇదే కావడంతో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఈ పదవి భర్తీ కోసం ప్రత్యేక దృష్టి సాధించినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పార్టీ కష్ట కాలంలో నర్సారెడ్డి వెంబడి ఉన్న నాయకులను గుర్తించి ఈ పదవిని కట్టబెట్టే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. గజ్వేల్ నియోజకవర్గంలో ములుగు మండలం వంటిమామిడి మార్కెట్ ఎస్సీలకు కేటాయించారు. మిగతా మార్కెట్లు మహిళలకు, జనరల్ స్థానాలకు రావడంతో పలువురు కాంగ్రెస్ నాయకులు నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకుంటున్నారు. గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి నర్సారెడ్డి పై రోజురోజుకు ఒత్తిడి పెరుగుతుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకమండళ్లను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్న సందర్భంలో మార్కెటింగ్ శాఖ చైర్మన్ స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి ప్రభుత్వానికి పంపించింది. సిద్దిపేట జిల్లాలో గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, చిన్నకోడూర్, నంగునూర్, తొగుట, కొండపాక, బెజ్జంకి, హుస్నాబాద్, చేర్యాల తదితర వ్యవసాయ మార్కెట్ల కమిటీ చైర్మన్‌ను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. జిల్లాలో 14 మార్కెట్ కమిటీలున్నాయి. ఇందులో జనరల్ మహిళ 2, ఎస్సీ మహిళ 2, బీసీ మహిళకు 1 మార్కెట్ కమిటీని రిజర్వు చేశారు. మిగతా 9 మార్కెట్ కమిటీలను జనరలు కేటాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ఇటీవలే రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ కమిటీలను రద్దు చేశారు. కొత్తగా నియామకాలు చేపట్టనుండటంతో ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సిద్దిపేట, మిరుదొడ్డి (జనరల్ మహిళ), చిన్నకోడూరు, నంగునూరు, తొగుట, గజ్వేల్, దౌల్తాబాద్, కొండపాక, దుబ్బాక, బెజ్జంకి, హుస్నాబాద్ (జన రల్), కోహెడ, వంటిమామిడి (ఎస్సీ మహిళ), చేర్యాల (బీసీ మహిళ)కు రిజర్వు చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న మార్కెట్ కమిటీలను భర్తీ చేసేందుకు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి కసరత్తులో నిమగ్నమయ్యారు.

బీజేపీ శ్రేణుల విజయోత్సవ సంబరాలు

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

మెదక్ పార్లమెంట్ అభ్యర్థి బీజేపీ రఘునందన్ రావు భారీ మెజార్టీతో గెలవడంతో నారాయణరావుపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షులు పొన్నాల బాబు ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీ ఎంపీ రఘునందన్ రావుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

నవతెలంగాణ-గజ్వేల్

మెదక్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు గెలుపొందడంతో గజ్వేల్‌లో బీజేపీ నాయకులు బాణా సంచాలు పేల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పినట్లు బీజేపీ నాయకులు జస్వంత్ రెడ్డి తెలిపారు. మోడీ చేసిన అభివృద్ధి చూసి ఓట్లు వేశారన్నారు. రానున్న కాలమంతా బీజేపీ దేని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు టేకులపల్లి రామ్ రెడ్డి, కొన్నే రాజిరెడ్డి, వెంకట్ రెడ్డి, మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నవతెలంగాణ -నంగునూరు

మోడీ నేతృత్వంలో ఎన్డీఏ కూటమి విజయం సాధించడం, మెదక్ ఎంపీగా రఘునందన్ రావు గెలుపు సాధించడంతో నంగునూరు మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ శ్రేణులు బాణాసంచాలు కాల్చి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి నాయకులు వల్లపురెడ్డి రజనీకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, ప్రవీణ్ కుమార్, తుపాకుల నరేష్, వివిధ గ్రామాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-ములుగు

ములుగు మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వద్ద బాణాసంచా కాల్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. జై బీజేపీ, జై రఘునందన్ రావు, మోడీగారి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మన్నె శ్రీను ఉప అధ్యక్షులు ఎలేందర్ రెడ్డి. ఎస్టి మండల అధ్యక్షుడు కూతాడి అశోక్ మండల కార్యదర్శి గుర్రాల నర్సింలు ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్. రైతు విభాగం అధ్యక్షులుచే భర్తీతి వీరేష్ బూత్ అధ్యక్షులు కరుణాకర్. కిషోర్ అశోక్ సుంకరి రమేష్ కార్యకర్తలు బీజేపీ ఉపాధ్యక్షుడు భాను ప్రసాద్ మణికంఠ నగేష్, కొల్తూర్ శ్రీనివాస్ బిల్లా కుమార్ తదితరులు పాల్గొన్నారు.







అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఆదరణ కరువు


- నాయకుల మధ్య సఖ్యత లోపమే మధుకు శాపం

నవతెలంగాణ-సిద్దిపేట

లోకసభకు జరిగిన ఎన్నికల ఫలితాలలో సిద్దిపేట జిల్లాలో పోలైన ఓట్ల ఫలితాలను చూస్తుంటే కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ కరువైందని చెప్పవచ్చు. కాంగ్రెస్ నాయకుల మధ్య సఖ్యత లోపమే కాంగ్రెస్ అభ్యర్థి మధుకు శాపంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలను ఆలోచించి తీసుకువచ్చిన 6 గ్యారెంటీ పథకాలు కొంతవరకు సక్సెస్ అయినప్పటికీ, ఆ లాభం మాత్రం నియోజకవర్గంలోని నాయకుల మూలంగా మధుకు ఓట్ల రూపంలో రాకుండా పోయాయి. అంతేకాకుండా ఆయనను సిద్దిపేట జిల్లాలో మూడో స్థానంలో నిలబెట్టాయి. జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గాలు మెదక్ లోకసభలో ఉన్నాయి. జిల్లాలో బిఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డికి 2,17,647 ఓట్లు రాగా, బిజెపి అభ్యర్థి రఘునందన్ రావుకు 1,70,507 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి మధు కు 1,30,354 ఓట్లు వచ్చాయి. వీటిని బట్టి చూస్తుంటే నియోజకవర్గ ఇన్చార్జిలు ఏ విధంగా పని చేశారో తెలిసిపోతుంది.

అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ఆదరణ కరువు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఈ లోకసభ ఎన్నికల్లో సిద్దిపేట జిల్లాలో మాత్రం ఆదరణ కరువైందని చెప్పవచ్చు. జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం మినహా సిద్దిపేట, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు మూడో స్థానంలో ఉంచారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ కాంగ్రెస్ అభ్యర్థి మధు గెలుపు కోసం ప్రచారం చేసినప్పటికీ, స్థానికంగా ఉన్న నియోజకవర్గ ఇన్చార్జిలు సరిగా పని చేయకపోవడం మూలంగానే మధును ప్రజలు మూడో స్థానంలో ఉంచారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను నియోజకవర్గ ఇన్చార్జిలు పట్టించుకోకపోవడం మూలంగానే ఇలాంటి ఫలితాలు వచ్చాయని నాయకులు భావిస్తున్నారు. ఎన్నికల సమయంలో కార్యకర్తలకు, పోలింగ్ బూత్ ఏజెంట్లకు, సీనియర్ నాయకులకు కొంత డబ్బులు ఇచ్చి పని చేయించాలని నాయకత్వం అనుకున్నప్పటికీ, కొంతమంది నియోజకవర్గ ఇన్చార్జిలు, వారితో ఉండే నాయకులు వచ్చిన డబ్బులను పంచకుండా తమ వద్దనే ఉంచుకోవడం మూలంగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పోలింగ్ రోజున మధు కోసం అంతగా ప్రచారం చేయలేదని తెలుస్తుంది. కొన్ని బూతులలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఏజెంట్ లేరని కాంగ్రెస్ నాయకులే చెబుతున్నారు. అధికారం ఉండి, పాలన ఉండి తమ అభ్యర్థి విజయం కోసం కష్టపడాల్సిన నాయకత్వం కొంతమంది మూలంగానే మధుకు మెజార్టీ రాకుండా చేశాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలే బాహాటంగా చెబుతున్నారు.



నియోజకవర్గాల వారిగా పోలైన ఓట్లు

కాంగ్రెస్ అభ్యర్థి మధుకు దుబ్బాక నియోజకవర్గంలో 31,641 ఓట్లతో మూడవ స్థానంలో ఉండగా, సిద్దిపేట నియోజకవర్గంలో 33,174 ఓట్లతో ఇక్కడ కూడా మూడో స్థానంలో నిలిచారు. గజ్వేల్ నియోజకవర్గంలోనే 65,539 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. కొంతమంది నాయకులు కింది స్థాయి కార్యకర్తలను, సీనియర్ నాయకులను పట్టించుకోకపోవడం మూలంగానే మధుకు ఓట్లు రాకుండా పోయాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, గెలవడానికి అవకాశం ఉన్నా మధును గెలిపించుకోలేకపోయాయని చెప్పవచ్చు.

కేసీఆర్ కంటే వెంకటరామిరెడ్డికి తగ్గిన మెజార్టీ

నవతెలంగాణ-గజ్వేల్

గత ఏడు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన మెజార్టీ ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల్లో 25 వేలు తగ్గింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నుంచి పోటీ చేసిన కేసీఆర్‌కు బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పై 45 వేల మెజార్టీతో కేసీఆర్ గెలుపొందారు. గత ఎన్నికల్లో కేసీఆర్‌కు 88,850 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 67 వేల పైచిలుకు ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డికి 32 వేల ఓట్లు వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికలు వచ్చే సరికి బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి వెంకటరామ్ రెడ్డికి 85,280 ఓట్లు రాగా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు 65,459 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డికి 32 వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితికి 20 వేలం మెజార్టీ వచ్చింది. గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి 67 వేలు రాగ ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో రఘునందన్ రావుకు గజ్వేల్ నియోజకవర్గం నుంచి 57,458 ఓట్లు వచ్చాయి. నియోజకవర్గంలో పదివేల ఓట్లు బీజేపీకి తగ్గగా కాంగ్రెస్కు 30 వేల ఓట్లు పెరిగాయి. ఏదేమైనా ఇతర నియోజకవర్గాల కన్నా గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ 20 వేల ఓట్లు మెజార్టీ సాధించిందని చెప్పాలి.

